క్లుప్తంగా

సంతగుడిపాడులో పారిశుద్ధ్య పనులు



రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో పారిశుద్ధ్య పనులకు శ్రీకారం చుట్టారు. కాల్వల్లో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మురుగు కాల్వల్లో నుంచి తీసిన పూడిక మట్టిని ట్రాక్టర్లతో బుధవారం ఊరు బయటకు తరలించారు. పారిశుద్ధ్య పనులను సర్పంచ్, ఉపసర్పంచ్ ఉయ్యాల సీతమ్మ, పల్లకి అంజనారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేష్ తదితరులు పర్యవేక్షించారు.

చిత్రకారుడు వజ్రగిరికి సత్కారం



వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్‌కు గౌరవ డాక్టరేట్ వచ్చిన సందర్భంగా గుమ్మడి వృద్ధాశ్రమంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వజ్రగిరి జెస్టిస్ గీసిన చిత్రాల గురించి పలువురు కొనియాడారు. అనంతరం జెస్టిస్‌ను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మారుతి వరప్రసాద్, న్యాయవాది రామ్మోహనరావు, కవి కరిముల్లా, యూటీఎఫ్ నాయకులు నాగేంద్రుడు, అప్పరాజు నాగేశ్వరరావు, గుమ్మడి, సద్దాం, అంజి, స్టార్ వలి, బాజీ, సుభాని పాల్గొన్నారు

కోటప్పకొండలో శ్రీదత్త ఆస్పత్రి ఉచిత వైద్య శిబిరం

600 మందికి వైద్యసేవలు



నరసరావుపేట రూరల్: తొలికాదశి సందర్భంగా కోటప్పకొండ దేవస్థానం వద్ద శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు హాస్పిటల్ ఎండీ, ప్రముఖ గుండె వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ పేర్కొన్నారు. వైద్య శిబిరాన్ని శాసనసభ్యులు చదలవాడ అరవింద్ బాబు సందర్శించారన్నారు. సమాజ సేవకు శ్రీ దత్త హాస్పిటల్ ఎప్పుడు ముందుంటుందని, ఈ వైద్య శిబిరంలో 600 మందికి ఉచితంగా రక్తపోటు, మధుమేహం వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించామని ఆయన వెల్లడించారు. అలాగే దైవదర్శనానికి వచ్చిన భక్తులకు అల్పాహారంతో పాటు పదివేల మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేశామన్నారు. ఈ శిబిరంలో హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ గార్లపాటి జ్ఞానేశ్వరి, ప్రముఖ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ చల్లా వెంకటేశ్వరరావు, డాక్టర్ తేజస్విని, జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఫరూక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంఈవోగా శ్రీనివాసరెడ్డి



మాచవరం: మాచవరం మండల ఇన్‌చార్జి విద్యా శాఖాధికారిగా ఎ.శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. జిల్లా ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంఈవోగా పనిచేసిన బి.రాజకుమారి సెలవుపై వెళ్లడంతో మండలంలోని మోర్జంపాడు జీవీజీకేఆర్వో హైస్కూల్‌లో హెచ్ఎంగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిని ఇన్‌చార్జి ఎంఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మండలంలో విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డిని చెప్పారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

క్రోసూరు: మండలంలోని అందుకూరు గ్రామానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమయ్యారు. ఈ నెల 15వ తేదీ నుంచి అతడు కనిపించడం లేదని తండ్రి పోలీసుస్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.షఫీ తెలిపారు. గ్రామానికి చెందిన కట్లగుంట వెంకట శివ (25) అదృశ్యమైన సమయంలో ఆకుపచ్చ చొక్కా, జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నారు. 15న ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96235, 08640-227133 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



కోటప్పకొండలో త్రికోటేశ్వరుని దర్శనానికి తరలివచ్చిన భక్తజనం



కోటప్పకొండ వద్ద గిరి ప్రదక్షిణ చేస్తున్న ఎమ్మెల్యే చదలవాడ

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



వద్లమూడివారిపాలెం గంగాపార్వతీ సమేత నీలకంఠేశ్వర స్వామి, విప్పర్లలోని గంగాపార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి, చిలకలూరిపేటలో పండ్లతో ప్రత్యేక అలంకరణలో కల్యాణ వెంకటేశ్వరస్వామి, చిలకలూరిపేట చౌత్రా సెంటర్‌లోని శివాలయంలో మూలవిరాట్, కొత్తపల్లి సంజీవ ఆంజనేయస్వామి



గణపవరం ఆలయంలో ప్రత్యేక పూజల్లో భక్తులు



శావల్యాపురంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు

నాదెండ్ల: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో అన్ని శైవ క్షేత్రాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. ఉదయాన్నే శివాలయాలను సందర్శించి పూజలు, అభిషేకాలు జరిపారు. చిరుమామిళ్లలో కొలువైయున్న కోటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు తొలి ఏకాదశి వేడుకలు జరిపారు. గ్రామ వాసి కస్టమ్స్ శాఖ అధికారి గాదె శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త కొల్లిపర శ్రీనివాసరావు, కమిటీ అధ్యక్షులు శివారెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు, విశిష్ట అభిషేకాలు జరిగాయి. సాయంత్రం ఆలయం వద్ద కోలాట ప్రదర్శన నిర్వహించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణ చేశారు. నాదెండ్ల, గణపవరం, చందవరం, సాతులూరు, సంకురాత్రిపాడు, కనపర్రు, తూబాడు, గొరిజవోలు, అప్పాపురం గ్రామాల్లోని శివాలయాల్లో ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాల్లో పాల్గొన్నారు. స్వామివారి దర్శనార్థం కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు, పోట్లూరు, మతుకుమల్లి, కారుమంచి, తదితర గ్రామాల్లో తొలిఏకాదశి పర్వదినం వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి శివాలయాల్లో శివనామ స్మరణతో మారుమోగడంతో పాటు ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీ ప్రసన్న రామలింగేశ్వరస్వామికి అలంకరణ భక్తులను కనువిందు చేసింది. ఆలయ పూజారి రావిపాటి సాయి భరత్ శర్మ సారథ్యంలో ఇక్కడ ప్రత్యేక అభిషేకాలు జరిగాయి.

పేలపిండి ప్రసాదం పంపిణీ

నరసరావుపేట ఈస్ట్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం శ్రీకల్పవల్లి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు సాంప్రదాయ పేలపిండి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. వల్లప్పచెరువులోని శ్రీకేదారేశ్వరస్వామి ఆలయం, సత్తెనపల్లిరోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద భక్తులను పేలపిండి ప్రసాదాన్ని ప్రత్యేక ప్యాకెట్ల ద్వారా అందచేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ వెల్లంపల్లి కేశవరావు, శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, వాసవీ క్లబ్ ప్రతినిధులు కొత్తమాసు సుజాతలక్ష్మీ, కాశీవిశ్వనాథరావు, వీరయ్య, నేరెళ్ల విజయలక్ష్మీ పాల్గొన్నారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల: మండల ప్రజలు బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఏకువజామునే లేచి స్నానాలు ఆచరించి గృహాల్లో పూజలు నిర్వహించుకున్నారు. గ్రామాల్లోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మరి కొందరు భక్తులు దగ్గరిలో ఉన్న కోటప్పకొండ గిరి ప్రదక్షిణలకు వెళ్లారు. అలాగే చేజర్ల, గుత్తికొండ బిలం, అమరావతి, వినుకొండ, త్రిపురాంతకం లాంటి క్షేత్రాలకు వెళ్లారు. భక్తులు పండుగకు ప్రాధాన్యత ఉన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. పాలపిండి, శనగగుగ్గిళ్ళు, పులిహోర లాంటి ప్రసాదాలను పంపిణీ చేశారు.



నరసరావుపేటలో పేలపిండి ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధుల

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు వచ్చారు. పట్టణంలోని అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆర్యవైశ్య కల్యాణ మండప ప్రాంగణంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మహిళా భక్త బృందంచే భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చౌత్రాసెంటర్, కళామందిర్ సెంటర్‌లోని శివాలయాలతో పాటు పలు ఆలయాలు భక్తులతో క్రిక్కిరిశాయి. మండలంలోని బొప్పూడి కొండపై స్వయంభూ వెలిసిన శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చక స్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు.



చిలకలూరిపేటలో భజన నిర్వహిస్తున్న మహిళా భక్తులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలివే

చిలకలూరిపేట: విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పాటిమీద, లక్ష్మి నరసింహస్వామి గుడి, జాగుపాలెం, పొందిలిపాలెం, చీరాలరోడ్డు పరిసర ప్రాంతాల్లో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గుంతకు మరమ్మతు చేయరూ...



నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేట నుంచి సత్తెనపల్లికి వెళ్లే మార్గంలోని ఇస్సపాలెం గ్రామ సమీపంలో మణికంఠ వే బ్రిడ్జి వద్ద గుంతల మయమైన ఆర్ అండ్ బీ రోడ్డుకు మరమ్మతు చేసి ప్రమాదాలకు కారణమౌతున్న వే బ్రిడ్జిలను అక్కడి నుంచి తొలగించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. బుధవారం పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. మణికంఠ వే బ్రిడ్జి వద్ద రోడ్డు కొంత ఆక్రమణకు గురై గుంతల మయంగా మారిందన్నారు. రాకపోకలు సాగించే వాహనదారులు, బాటసారులు అనేక ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. పక్కనే రెండు వే బ్రిడ్జీలు ఉండటంతో భారీ వాహనాలు కాటా వేయించుకునేందుకు నిరంతరం ఇక్కడికి వచ్చి వెళుతున్నాయన్నారు.

దీనివల్ల రోడ్డు పెద్దపెద్ద గుంతలుగా ఏర్పడి, ప్రమాదాలు జరిగే స్థలంగా మారిందన్నారు. ఈ మేరకు పలు వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నట్లుగా తమ దృష్టికి రావటంతో ఆ స్థలాన్ని పరిశీలించామన్నారు. ఆ వే బ్రిడ్జీల వద్దకు రోడ్డు నుంచి వెళ్లడానికి, బయటకు రావటానికి అక్కడ సరైన స్థలం లేకపోవటంతో సమస్య తలెత్తిందన్నారు. దీనిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దెబ్బతిన్న రోడ్డును వెంటనే బాగు చేయాలని అధికారులను డిమాండ్ చేశారు.

యువకుల సంచారం అనుమానాస్పదం

- పోలీసులను చూసి ద్విచక్ర వాహనాన్ని వదిలి పరారు
- కొద్దిసేపటికే తిరిగి వచ్చి వాహనంతో ఉడాయింపు

నాదెండ్ల: గణపవరం గ్రామంలోని సినిమాహాల్ రోడ్డులో అర్ధరాత్రి 2 గంటల సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇరువురు యువకులను ఎస్సై జె.బలరామ్‌రెడ్డి గమనించి విచారించేందుకు యత్నించగా, ఇరువురు యువకులు పరారయ్యారు. తమ ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలి వాహనం తాళం తీసుకెళ్లారు. దీంతో పోలీసులు ద్విచక్ర వాహనాన్ని సమీపంలోని ఇంట్లో ఉంచి వెళ్లారు. పోలీసులు వెళ్లిన కొద్ది సేపటికే ఇరువురు యువకులు అక్కడి పలు వీధులను వెతికి తమ వాహనాన్ని గుర్తించారు. ద్విచక్ర వాహనం స్టార్ట్ ప్లగ్‌ను పోలీసులు తీసుకెళ్లటంతో వాహనం స్టార్ట్ కాలేదు. దీంతో సమీపంలో ఓ ఇంటి ముందు నిలిపి ఉంచిన మరో ద్విచక్ర వాహనం ప్లగ్‌ను పీకేసి తమ వాహనానికి బిగించుకుని అక్కడి నుంచి పరారయ్యారు. యువకుల వ్యవహారం ఆ వీధిలోని సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. స్థానికులు విషయాన్ని పోలీసులకు సమాచారమిచ్చారు. కొంతకాలంగా గణపవరం గ్రామంలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పోలీసులు రాత్రి పహారా నిర్వహించి దొంగతనాలు జరగకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యం

గురుభక్తికి మారుపేరు ఏకలవ్యుడు

చిలకలూరిపేట: గురుభక్తికి మరోపేరు ఏకలవ్యుడని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బి.శ్రీను నాయక్ చెప్పారు. సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రైతు బజారు ఎదురుగా ఉన్న ఏకలవ్యుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఏకలవ్యుడి గురించి ప్రసంగించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు మద్దుల వెంకటకోటయ్య, కొండ్రముట్ల నాగేశ్వరరావు, తుర్లపాటి వెంకటనగేష్, బి.చిన్నానాయక్, పాలపర్తి శ్రీనివాసరావు, సలికినీడి నాగరాజు, కుంభా నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఏకలవ్యుడి విగ్రహం వద్ద గిరిజన సంఘాల నాయకులు

● ఆరుతడికే ‘విత్తు’



ఆరుతడి పంటలు కంది, మినుమ పంటల సాగుకు రైతన్నలు ఆసక్తి చూపుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఖరీఫ్ సీజను ప్రారంభం కావడం, ఈక్రమంలో సాగర్ కాల్వ పరిధిలో లేని సాగు భూములు కల్గిన రైతులు గత్యంతరం లేక ఆరుతడి పంటలు సాగుకు సిద్ధం అవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు ధాటికి సాగుభూములన్నీ ట్రాక్టర్ల దుక్కిదున్ని వ్యవసాయానికి రంగం సిద్ధం చేస్తున్నారు. మండలంలోని శానంపూడి, మతుకుమల్లి, శావల్యాపురం, కనమర్లపూడి గ్రామాల పరిధిలో కంది పంట సాగుకు రైతులు తమ పొలాలను సిద్ధం చేసుకుంటూ మరో వైపు కంది విత్తనాలను ట్రాక్టరు ద్వారా విత్తుతున్నారు.

–శావల్యాపురం

ఘనంగా మొహర్రం వేడుకలు



కల్యాణీ సెంటర్లో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



రొంపిచర్లలో పీర్లకు ఊరేగింపు జరుపుతున్న దృశ్యం

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల, రొంపిచర్ల, కొత్తపల్లి, ఎడ్వర్డ్‌పేట గ్రామాల్లో ముస్లింలు బుధవారం మొహర్రం పర్వదిన వేడుకలను నిర్వహించుకున్నారు. పీర్లకు ఊరేగింపులు నిర్వహించారు. ఈ వేడుకల్లో హిందూ, ముస్లింలు సోదర భావంతో కలిసి మెలిసి నిర్వహించుకున్నారు.

నాదెండ్ల మండలంలో...

నాదెండ్ల: సమాజ హితాన్ని కాంక్షిస్తూ అన్యాయంపై పోరాడి అమరులైన ఇమామ్ హుస్సేన్ త్యాగాన్ని స్మరించుకోవటం మొహర్రం విశిష్టత అని ముస్లిం పెద్దలు అన్నారు. మండలంలోని చందవరం గ్రామంలో మొహర్రం మాసాన్ని పురస్కరించుకుని స్థానిక పీర్ల చావిడీలో గత పది రోజులుగా వేడుకలు జరుగుతున్నాయి. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. కుల మతాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

స్థానిక ఇమామ్ మస్తాన్‌వలి మాట్లాడుతూ, సుమారు 1400 ఏళ్ల క్రితం ప్రజాభిప్రాయానికి భిన్నంగా వ్యవహరించిన చక్రవర్తిపై పోరుసల్పి తన ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడు ఇమామ్ హుస్సేన్ అని పేర్కొన్నారు. ఆయన త్యాగాన్ని స్మరించుకుంటూ గత పది రోజులుగా జరుగుతున్న మొహర్రం వేడుకలకు స్థానికులే కాక చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీర్ల చావిడీకి విద్యుత్ దీపాలంకరణ చేశారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేటటౌన్: మొహర్రం పండుగ వేడుకలను పట్టణంలోని ఇస్లాంపేటలో ఘనంగా నిర్వహించారు. ముస్లిం షాదీఖానా వద్ద ఉన్న పీర్ల చావిడిలో పంజాలను ముజావర్లు సుందరంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పంజాలను దర్శించుకున్నారు. పీర్లకు అలంకరణకు చేసేందుకు పూలదట్టీలను, సుగంధ ద్రవ్యాలను సమర్పించారు. ముజావర్లు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన వీధుల్లో పీర్లను ఊరేగించారు. అనంతరం అగ్నిగుండలో తిరుగాడారు. ఈ సందర్భంగా ఖురాన్ పఠనం గావించి, వివిధ రకాల ప్రసాదాలు, పానకం పంపిణీ చేశారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: పట్టణంలో మొహరం పర్వదినాన్ని బుధవారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లోని పీర్ల చావిడలనుంచి పీర్లు ఉరేగింపుగా శివునిబొమ్మ సెంటర్‌లోని అగ్ని గుండం వద్దకు చేరుకొన్నారు. పీర్లను అగ్ని గుండం దాటించి షహదత్ నిర్వహించేందుకు పాతూరులోని బావి వద్దకు తీసుకవెళ్లారు. పీర్లు వస్తున్న దారి పొడవునా కుల మతాలకు అతీతంగా స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. తమ చిన్నారులను పీర్లుకు తాకించి ఆశీస్సులు అందుకున్నారు.



ఊరేగింపుగా వస్తున్న పంజా (పీర్లు)లు



నాయబ్‌బజార్ పీర్లు

వృద్ధాశ్రమంలో అన్నదానం



గురజాల: సీపీఐ నాయకుడు, పత్రికా విలేకరి యేచూరి లక్ష్మీనారాయణ వర్ధంతిని పురస్కరించుకుని వృద్ధాశ్రమంలో బుధవారం అన్నదానం చేశారు. స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో లక్ష్మీనారాయణ కుమారుడు మణి ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. లక్ష్మీనారాయణ పోరాట నాయకుడని వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్ పర్సన్ షేక్ బడేజానీ, ఏపీపీ బండి వీరభద్రుడు, సీపీఐ నాయకుడు షేక్ హుస్సేన్, విలేకరులు నారాయణభట్లు సుబ్రమణ్యం, బి.అలరాజు, నాగులుమీరా, కుటుంబ సభ్యులు తదితరులున్నారు.